1St Happy Work Anniversary. Year

షణ్ముఖ SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health Best for Readers THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 21 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 22 జనవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 21 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 22 January 2026 PAGES : 8 PRICE : 3/-


## ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత.. ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు రంగం సిద్ధమవుతోంది. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. మొదట క్యాబినెట్‌లో ఆమోదం తెలిపి.. అనంతరం పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. -మిగతా 2లో

## ఇరాన్ ను భూస్థాపితం చేయాలని ఆదేశించా: ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జనవరి 21)
ఇరాన్, అమెరికాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పీక్ కు చేరాయి.. తమ లీడర్ కు హాని తలపెడితే ప్రపంచమే తగలబడిపోతుందని ఇరాన్ హెచ్చరించగా.. తనను హత్య చేస్తే ఇరాన్ భూస్థాపితం అవుతుందని ట్రంప్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థతో ట్రంప్ మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.తనపై ఇరాన్ హత్యాయత్నం చేస్తే.. తాను బతికి ఉన్నా, చనిపోయినా సరే.. -మిగతా 2లో

## సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దడంలో సహకరించండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు సాంకేతిక సహకారం అందించాలని ఇజ్రాయెల్ దేశ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్‌బరక్కత్, ట్రేడ్ కమిషనర్ గోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ట్రేడ్ మిషన్ ప్రతినిధి షిర్‌స్లట్కీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్ల తయారీ సాంకేతికత అందించే విషయమై వారితో చర్చించారు. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్? సాంకేతికతపై సహకారం అందించాలని కోరారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌తోపాటు సెమీకండక్టర్ల తయారీ, జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల మాదిరిగా ఇజ్రాయెల్ కూడా ఒక పారిశ్రామిక క్లస్టర్?ను ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు.

**స్విస్ ప్రతినిధి బృందంతోచంద్రబాబు భేటీ**

ఏపీ-స్విట్జర్లాండ్‌ల మధ్య వివిధ రంగాల్లో వాణిజ్య సంబంధాలు.. ఏపీలో స్విస్ కంపెనీల కార్యకలాపాలు.. విస్తరణ అంశాలపై సీఎం చంద్రబాబు ఆ దేశ ప్రతినిధి -మిగతా 2లో



# దీర్ఘకాలిక రాబడులు ఇచ్చే ఆవిష్కరణలపై దృష్టి

### రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రోత్సాహకాలు
### ఏపీ యువత ప్రతిభపై పెట్టుబడి పెడుతున్నాం: లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలిక రాబడులు ఇచ్చే ఆవిష్కరణల ఎకోసిస్టమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తున్నామని వెల్లడించారు. దావోస్ కాంగ్రెస్ విలేజ్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఆధ్వర్యంలో 'దృఢమైన ఆవిష్కరణల కోసం పెట్టుబడులను బలోపేతం చేయడంలో మనం ఎక్కడ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "విశాఖలో గూగుల్ క్లౌడ్, సిస్కో, ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్‌తో భాగస్వామ్యంతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లతో పాటు ఆర్అండ్‌డీపై ప్రత్యక్షంగా పెట్టుబడి పెడుతున్నాం. దీంతో ఆలోచనలు వేగంగా స్టార్టప్‌లుగా మారతాయి. పెట్టుబడులను ఆకర్షించడమంటే కేవలం సంస్థలను తీసుకురావడం కాదు. ఆవిష్కరణకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడం" అని తెలిపారు.

**ప్రపంచ సవాళ్లకు ఏపీ ప్రతిభతో పరిష్కారం :** "ఏపీలోని ప్రతిభ ప్రపంచ సవాళ్లకు పరిష్కారం చూపుతుందని మేం భావిస్తున్నాం. పారిశ్రామిక క్లస్టర్లలో ఆర్అండ్‌డీని ఏకీకృతం చేస్తూ టాలెంట్‌పై పెట్టుబడి పెట్టి, ప్రపంచ భాగస్వామ్యాలకు విశ్వసనీయ యాంకర్‌గా పనిచేస్తున్నాం. క్లీన్ ఎనర్జీ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి, 167 గిగావాట్ల ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. క్వాంటమ్ వ్యాలీ, భారతదేశంలో మొట్టమొదటి డ్రోన్‌సిటీ, స్పేస్ సిటీలను ఏర్పాటుచేస్తున్నాం" అని లోకేశ్ వెల్లడించారు. "త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నాం. వివిధ రంగాల్లో క్లస్టర్ల వారీ అభివృద్ధి, విశ్వవిద్యాలయాలు, నైపుణ్య సంస్థలతో పరిశ్రమల అనుసంధానం, దీర్ఘకాలిక విలువను సృష్టించే విధానాన్ని రూపొందించడంపై దృష్టిసారించాం. ప్రభుత్వం, పారిశ్రామిక సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయడంతో ఏపీలో అద్భుత ఫలితాలు సాధించాం. 18నెలల్లో రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ బోర్డు రూ. 8.75లక్షల కోట్ల విలువైన 211 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది' అని మంత్రి పేర్కొన్నారు. 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ నివేదిక ప్రకారం 2024లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులు తగ్గిపోయాయి. ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు పబ్లిక్ ఫైనాన్స్ ద్వారా గ్రాంట్లు, ఆర్అండ్‌డీ రాయితీలు, మిశ్రమ ఆర్థిక సహాయం, వ్యూహాత్మక రంగాలలో నేరుగా పెట్టుబడులు పెట్టాలి. ఆవిష్కరణలకు అవసరమైన ఎకోసిస్టమ్ నిర్మాణానికి నియంత్రిత చట్టాలు, డిజిటల్, ఫిజికల్, ఎడ్యుకేషనల్ మౌలికసదుపాయాలను ప్రభుత్వాలు కల్పించడం తప్పనిసరి" అని లోకేశ్ సూచించారు.

## విశాఖలో నైపుణ్యాభివృద్ధి క్యాంపస్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
విశాఖపట్నంలో ఐటీ క్యాంపస్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని మంత్రి లోకేశ్ కాగ్నిజెంట్ ప్రతినిధులను కోరారు. తాత్కాలిక క్యాంపస్‌లో సౌకర్యాలు పెంచడం ద్వారా ఉద్యోగుల సంఖ్య పెంచే అంశాన్ని పరిశీలించాలన్నారు. సంస్థ సీఈవో రవికుమార్ సింగిశెట్టి, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ జతిన్ దలాల్, ప్రెసిడెంట్ అమెరికాస్ సూర్య గుమ్మడిలతో మంత్రి లోకేశ్‌సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ 'ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్, డేటా, డిజిటల్ ఇంజినీరింగ్‌లో సంస్థ నియామకాల కోసం అవసరమైన సిబ్బందిని తీర్చిదిద్దేందుకు విశాఖలో డెడికేటెడ్‌సెంట్రలైజ్డ్ నైపుణ్యాభివృద్ధి -మిగతా 2లో

## ఉగాది నుంచి 'పచ్చదనం' ప్రాజెక్టు అన్ని శాఖలూ కార్యాచరణ సిద్ధం చేయాలి

### ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
'రాష్ట్రాన్ని 50% పచ్చదనం(గ్రీన్ కవర్)తో నింపే ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధితో భాగస్వాములు కావాలి. ఉగాదిలోపు ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఉగాది నుంచి కార్యాచరణ ప్రారంభించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. 'పరిశ్రమల శాఖ కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీరప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కలను నాటేందుకు సిద్ధం కావాలి. స్వదేశీ మొక్కలను ఈ ప్రాజెక్టులో నాటేలా చూడాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రం మొత్తం భూభాగంలో 2047 నాటికి సగం పచ్చదనంతో నిండిపోవాలనేది లక్ష్యం. ఇందుకు 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాలి. ప్రస్తుతం 30% పచ్చదనం ఉంది. 2030 నాటికి 37% లక్ష్యం సాధించాలి. ఇందుకు 9 లక్షల హెక్టార్లలో చెట్లను పెంచాలి. ఇందులో ఉద్యానశాఖ 12% మొక్కలు నాటే లక్ష్యం తీసుకోవాలి. జాతీయ రహదారుల్లో రహదారుల వెంట మొక్కలు నాటినట్లే రాష్ట్ర రహదారుల వెంట కూడా అమలు చేయాలి. -మిగతా 2లో

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు... నో పే!: అయ్యన్నపాత్రుడు

### స్పీకర్ల మహాసభలో అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
వైసీపీ ఎమ్మెల్యేలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి హాజరు కాని ఎమ్మెల్యేలకు 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాకుండా జీతాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన స్పీకర్ల మహాసభలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల పట్ల శాసన వ్యవస్థకు ఉన్న జవాబుదారీతనం అంశంపై అయ్యన్నపాత్రుడు కీలక ప్రసంగం చేశారు.ఎమ్మెల్యేలు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులని, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం వారి ప్రాథమిక బాధ్యత అని స్పీకర్ గుర్తు చేశారు. ప్రజలు నమ్మకంతో ఎన్నుకుని పంపిన ప్రతినిధులు సభకు రాకుండా జీతాలు తీసుకోవడం సరికాదని స్పష్టంగా చెప్పారు. శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొన్నప్పుడే ప్రజల సమస్యలు చర్చకు వస్తాయని అన్నారు. ఈ అంశంపై లోక్‌సభ స్పీకర్‌తో -మిగతా 2లో

## వైద్యులు ప్రభుత్వ సేవలకు కట్టుబడాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 21)
'ప్రభుత్వ రాయితీలతో పీజీ పూర్తిచేసిన వైద్యులు నిబంధనలకు కట్టుబడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలందించాలి. అందుకు విరుద్ధంగా ప్రైవేటురంగానికి వెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 57 మంది వైద్యులకు నోటీసులు జారీచేసి, కొందరి నుంచి




సొమ్ము రికవరీ ప్రారంభించామ'ని రాష్ట్ర శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. తిరుపతి కలెక్టరేట్లో వివిధ శాఖలతో సమీక్షించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. జీవోలు 85, 127, 311 అమలుపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కమిటీ చర్చించిందని, జీవో 85లో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా జీవో 127లో కొన్ని సవరణలు చేశామని చెప్పారు. వాటిని క్షేత్రస్థాయిలో అమలుపరచాలని ఆదేశించారు. ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు -మిగతా 2లో

## అంతరిక్షం నుంచి చూస్తే.. ఆ గొడవలు చాలా 'సిల్లీ' : సునీతా విలియమ్స్

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జనవరి 21)
అంతరిక్షయానం తనలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. అంతరిక్షం నుంచి భూమిని ఓ గ్రహంగా చూసినప్పుడు.. జీవితం పట్ల తన దృక్పథాన్ని మార్చివేసిందన్నారు. పలు అంశాలపై మనుషుల మధ్య విభేదాలు, గొడవలు పడటం చాలా సిల్లీగా అనిపిస్తుందన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. 'ఐస్ ఆన్ స్టార్స్, ఫీట్ ఆన్ ది గ్రౌండ్' అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా అంతరిక్షయానంలో తన అనుభవాలను పంచుకున్నారు. "మనం అంతరిక్షానికి వెళ్లినప్పుడు ప్రతిఒక్కరు తమ ఇల్లు ఎక్కడుందని వెతకాలనే అనుకుంటారు. నా తండ్రి భారత్‌కు చెందిన వారు.. తల్లి స్లోవేనియా వ్యక్తి. -మిగతా 2లో



## 18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 21)

విద్యార్థులలో, యువకులలో ఓటు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని అర్థవంతంగా వివరించడానికి, ప్రతి ఓటు విలువ వివరించడానికి ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిజాయితీగా నిర్వహిస్తూ ప్రజాస్వామ్యం బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరు మనస్ఫూర్తిగా పని చేయాలని జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మండల తహసీల్దార్ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. వ్యాస రచన పోటీల నందు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన టి వెంకట హరికిరణ్ ప్రథమ బహుమతి, పి శృతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మార్కాపురం ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి కె మంజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొట్లగట్టుకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. వక్తృత్వ పోటీల నందు ప్రథమ బహుమతి సీహెచ్ షరోన్ రాణి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు పొదిలి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మార్కాపురంకు చెందిన బాను సాకేత్ ద్వితీయ బహుమతి, యాసిన్ తృతీయ బహుమతి పొందారు. క్విజ్ పోటీల నందు సీహెచ్ షరోన్ రాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు పొదిలి ప్రథమ బహుమతి, ఎంవి సుదర్శన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు పొదిలి ద్వితీయ బహుమతి, కె మంజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొట్లగట్టు తృతీయ బహుమతికి ఎంపికయ్యారన్నారు. వీరందరూ ఈ నెల 23వ తేదీన పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఒంగోలు నందు నిర్వహించే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని ఉప విద్యాశాఖాధికారి మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం విద్యాశాఖాధికారులు రామ్ దాస్ నాయక్, శార్వాణీ, సాధన డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూదన్ శాస్త్రి, ఉపాధ్యాయులు సైమన్, రవి కిషోర్, సకృనాయక్, వివిధ పాఠశాలల నుండి మండల స్థాయి విజేతలైన విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరేపల్లి, రామాయపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తుంది





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 21)

మండలంలోని వీరేపల్లి, రామాయపట్నం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా మండల వ్యవసాయధికారి వరి పంట పొలాలను పరిశీలించడం జరిగింది. వరిలో అక్కడక్కడా కాండం తొలుచు పురుగు మరియు ఆకుముడుత కనిపించడం జరిగింది. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3+ గుళికలు ఎకరాకు 10 కేజీలు లేదా ఫర్టెరా గుళికలు 4కేజీ లు వాడాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ విఏఏలు శైలజ, షారుఖ్, రైతులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ వెటరన్స్ చాంపియన్‌షిప్ పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)

ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ వెటరన్స్ చాంపియన్‌షిప్ పోటీలు జనవరి 25న పర్చూరులో నిర్వహిస్తున్నట్లు పీడీబీఏ సెక్రటరీ పి విజయకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషుల వెటరన్స్ విభాగాలలో మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. 35+, 40+, 45+, 50+, 55+, 60+, 65+, 70+ వయస్సు విభాగాల క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జనవరి 23 వ తేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలో పాల్గొనేందుకు సింగిల్స్ రూ.400, డబుల్స్ రూ.800, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్ తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 9398260109, 9000024100లో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ టోర్నమెంట్‌లో గెలిచిన వారు స్టేట్ చాంపియన్‌షిప్‌కు అర్హతను సాధిస్తారని నిర్వాహకులు తెలిపారు.

# మొదటి పేజీ తరువాయి

## ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత.. ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్న విషయం తెలిసిందే. 2024 జూన్2తో గడువు ముగియడంతో ఏపీకి రాజధానిని తప్పక ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. తమ రాజధానిగా అమరావతిని ప్రకటించాలని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపించింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, అమరావతి ప్రాంతంలో చేపట్టిన రాజధాని నిర్మాణ కార్యక్రమాలు, ఇతర చర్యలపై కేంద్రానికి నోట్ ఇచ్చింది. దీంతో ఏ తేదీ నుంచి అమరావతిని రాజధానిగా ప్రకటించాలో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర హోంశాఖ సూచించింది. 2024 జూన్ 2 నుంచే వర్తింపజేయాలని రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికను పరిశీలించిన కేంద్ర హోంశాఖ.. నోడల్? ఏజెన్సీగా అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటించేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అభిప్రాయాలను కోరింది. ఇప్పటికే పలు శాఖలు తమ అభిప్రాయాలు చెప్పగా.. పట్టణాభివృద్ధి, న్యాయ, వ్యవసాయశాఖల అభిప్రాయాలు త్వరగా పంపాలని సూచించింది. మంత్రిత్వ శాఖలతోపాటు నీతి ఆయోగ్ అభిప్రాయాన్ని కూడా తీసుకోనుంది. ఈ ప్రక్రియను పూర్తి చేసి పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు కేంద్ర హోంశాఖ నోట్? తయారు చేయడంలో నిమగ్నమైనట్లు సమాచారం.

## ఇరాన్ ను భూస్థాపితం చేయాలని ఆదేశించా: ట్రంప్

ఆ దేశాన్ని భూస్థాపితం చేయాలని తన సలహాదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని ట్రంప్ చెప్పారు. ఇరాన్ లో జరుగుతున్న అల్లర్లకు మద్దతు పలుకుతున్న ట్రంప్ పై ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇరాన్ లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా ఖమేనీ మండిపడ్డారు. ఈ క్రమంలోనే తమ నాయకుడిపై చేయి వేయాలని చూస్తే ఆ చేతిని తెగనరుకుతామని, ఖమేనీకి ఏదైనా జరిగితే ప్రపంచాన్ని తగలబెడతామని ఇరాన్ సైన్యానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు హెచ్చరించారు. దీనిపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ.. తనను చంపేయాలని చూసినా, చంపేసినా మీరు భూమ్మీదే ఉండరని తీవ్ర హెచ్చరికలు చేశారు.

## అంతరిక్షం నుంచి చూస్తే.. ఆ గొడవలు చాలా 'సిల్లీ' : సునీతా విలియమ్స్

అందుకే మొదట ఈ ప్రదేశాల గురించే చూశా. తొలుత నిర్దిష్ట ప్రదేశం (ఇల్లు) కోసం వెతికినా.. చివరకు భూమి అంతా ఒకటేనని తెలుసుకుంటాం. సముద్రాలు, మారుతున్న కాలాలు, ధృవాలు.. ఇలా అంతరిక్షం నుంచి అద్భుతమైన ఈ గ్రహాన్ని చూసినప్పుడు జీవితం పట్ల ఆలోచనా ధోరణి మారుతుంది. అవి డీప్‌ఫేక్ వీడియోలు: రాజ్యసభ ఎంపీ సుధామూర్తి వ్యక్తుల మధ్య విభేదాలపై మన అభిప్రాయాన్ని మారుస్తుంది. మనమంతా ఒక్కటే కదా.. కలిసి మెలసి పనిచేయాలనే భావనను కలిగిస్తుంది. అంతేకాదు.. ఓ ఇల్లాలిగా కుటుంబంలో వాదనల గురించి అర్థం చేసుకుంటా. కానీ, వాస్తవం ఏంటంటే.. అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు ఇవి సిల్లీగా అనిపిస్తాయి" అని సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. ఎప్పుడైనా దేనిగురించైనా భయపడ్డారా అనే ప్రశ్నకు బదులిస్తూ.. చాలా విషయాలకు భయపడతానని, తాను నివాసముండే చోట ఎలుగుబంట్లు ఉన్నాయని నవ్వుతూ సమాధానమిచ్చారు. నాసా లో దాదాపు మూడు దశాబ్దాలు పనిచేసిన సునీతా విలియమ్స్.. గతేడాది డిసెంబర్ 27న పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో మూడుసార్లు అంతరిక్షయానం చేసిన ఆమె.. 608 రోజులు ఐఎస్ఎస్‌లో ఉండి సుదీర్ఘ కాలం అంతరిక్షయానం చేసిన వ్యోమగాముల జాబితాలో చేరారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్నారు.

## సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దడంలో సహకరించండి

బృందంతో దావోస్?లో చర్చించారు. ఆ దేశ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి హెలెనే బడ్లిగర్ అర్టీడా, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి అంబాసిడర్ ఆండ్రియా రౌబర్, స్విస్ పార్లమెంటు సభ్యుడు నిక్ గుగ్గర్, సీకో సలహాదారు మార్టీనా బైటెన్హాదర్‌లతో సీఎం భేటీ అయ్యారు. దావోస్‌లో ఐరన్ మౌంటెన్ ప్రెసిడెంట్, సీఈవో విలియం ఎల్.మీనీతో భేటీ అయిన మంత్రి లోకేశ్

మూడోరోజూ దావోస్‌లో సీఎం బిజీ దావోస్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మూడో రోజూ (బుధవారం) కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రముఖ కంపెనీల సీఈఓలతో ముఖాముఖి భేటీ కానున్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం కాంగ్రెస్‌లో పారిశ్రామిక పురోగతిపై నిర్వహించే సెషన్‌లో పాల్గొంటారు. హురైసిస్ ఛైర్మన్ ఫ్రాంక్ రిచర్‌తో సమావేశం కానున్నారు. తమారా హాస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ సృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఓఓ ఖుష్బూ అవస్థి, కాలిబో ఏఐ అకాడమీ సీఈవో రాజ్‌వట్టికుట్టి ముఖ్యమంత్రితో సమావేశమై చర్చిస్తారు. ఏపీ సీఎన్ఎఫ్ నిర్వహించే హీలింగ్ ప్లానెట్ త్రూ రీజనరేటివ్‌ఫుడ్ సిస్టమ్స్‌పేరిట జరిగే చర్చలో పాల్గొంటారు. ట్రిలియన్ డాలర్ పివోట్ రీరేటింగ్ మార్కెట్ సిగ్నల్స్ ఫర్ నేచర్ పాజిటివ్ గ్రోత్ అనే అంశంపై చర్చలో పాల్గొంటారు. బ్లూమ్‌బర్గ్ సంస్థ నిర్వహించనున్న ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ సెషన్‌లో ముఖ్యవక్తగా ప్రసంగించనున్నారు. ఏపీ లాంజ్‌లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమంలో కేంద్రమంత్రులతో కలిసి పాల్గొంటారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్‌పేరిట నిర్వహించే కార్యక్రమానికీ సీఎం హాజరవుతారు.

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు... నో పే!: అయ్యన్నపాత్రుడు

పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అయ్యన్నపాత్రుడు కోరారు. శాసనసభ వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా మార్చాలంటే ఇలాంటి సంస్కరణలు తప్పనిసరిగా అవసరమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల హాజరు తప్పనిసరిగా ఉండేలా 'నో వర్క్.. నో పే' విధానం అమలైతే, శాసనసభ పనితీరు మెరుగుపడుతుందని, ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని స్పీకర్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## విశాఖలో నైపుణ్యాభివృద్ధి క్యాంపస్

క్యాంపస్‌ను ఏర్పాటు చేయండి. ఏపీలో ఇన్నోవేషన్లు, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయండి. దీనివల్ల ఏఐ, డిజిటల్ ప్రొడక్ట్ స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రైజ్ మెంటారింగ్, పైలట్‌ప్రాజెక్టుల విస్తరణపై దృష్టి సారించవచ్చు. ఏపీలోని విశ్వవిద్యాలయాలతో కలిసి ఏఐ ల్యాబ్‌లు, పరిశోధన, ఇంటర్న్‌షిప్‌లు, హైర్-లింక్డ్ క్యాప్‌స్టోన్ ప్రోగ్రామ్‌లు తీర్చిదిద్దేందుకు సహకరించాలి' అని కోరారు.

## వైద్యులు ప్రభుత్వ సేవలకు కట్టుబడాలి

30 శాతం రిజర్వేషన్ అంశంపై మార్పులు జరిగాయని చెప్పారు. పీజీ వైద్యులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యార్హత డిగ్రీ రద్దు, ప్రభుత్వ రాయితీలను వడ్డీతో సహా వసూలు చేయడంతో పాటు అవసరమైతే రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలు లేనందున కొంతమంది ఎంబీబీఎస్ వైద్యులకు అవకాశాలు కల్పించలేకపోతున్నామని, దీనిపై ప్రభుత్వం అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని కమిటీ అభిప్రాయపడినట్లు త్రిమూర్తులు చెప్పారు. రాష్ట్రంలో హెచ్?ఐవీ కేసులు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినప్పటికీ, గ్రామాలు, జాతరలు జరిగే ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు పెంచాలని సభ్యులు సూచించారు. కమిటీ సభ్యులు.. పీలేరు, శింగనమల, నగరి, సత్తెనపల్లి, కావలి ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, శ్రావణిశ్రీ, గాలి భానుప్రకాశ్, కన్నా లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంఈ రఘునందన్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## ఉగాది నుంచి 'పచ్చదనం' ప్రాజెక్టు అన్ని శాఖలూ కార్యాచరణ సిద్ధం చేయాలి

రాష్ట్రంలోని 40% తీర ప్రాంతం అటవీశాఖ పరిధిలో ఉంది. మిగిలిన భూభాగంలో అవసరమైన ప్రణాళికలు ఆయా శాఖలు రూపొందించి, అమలు చేయాలి. రైతుల భూముల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇచ్చే పండ్ల రకాలు నాటాలి. ముఖ్యమంత్రితో బడ్జెట్ కేటాయింపులపై చర్చిస్తా. ఫిబ్రవరి 5న నిర్వహించే తదుపరి సమావేశానికి అన్నిశాఖల అధికారులు సరైన ప్రణాళికతో రావాలి' అని పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కాంతిలాల్ దండే, శశిభూషణ్ కుమార్, కృష్ణబాబు, రాజశేఖర్ అటవీశాఖ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ పి.వి.చలపతిరావు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ రంజిత్ భాషా, ఏపీఐఐసీ ఉపాధ్యక్షుడు, ఎండీ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు.

# దళిత యువకుని బలవన్మరణం కేసులో నిందితులను అరెస్టు చేయరా?

### నిందితులు తెలుగుదేశం వారైనందునే డిఎస్పీ అలసత్వం
### కందుల ప్రవీణ్ కేసు అరెస్టుల పై జిల్లా ఎస్పీ స్పందించాలి
### దళిత నేత నీలం డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)


బలవన్మరణం కేసులో నిందితులు తెలుగుదేశం పార్టీకి చెందిన సంవత్సరం అయినా అరెస్టు చేయలేదని, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఒంగోలు డిఎస్పి అలసత్వం పై స్పందించి నిందితులను వెంటనే అరెస్టు చేయించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ గత సంవత్సరం జనవరి 15వ తేదీన నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో తన స్వగృహంలో కందుల ప్రవీణ్ అనే దళిత యువకుడు ఉరి వేసుకుని బలవన్ మరణం చెందాడన్నారు ఈ ఘటన 8/25 ఎస్సీ ఎస్టీ కేసుగా నాగులపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందన్నారు. 17వ తేదీన ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద కందుల ప్రవీణ్ తండ్రి డేనియల్ను, సాక్షులను వీడియో విచారణ జరిపారు. తరువాత 19వ తేదీన ఉప్పుగుండూరు లోని మృతుని స్వగృహానికి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి బంధువులను సాక్షులను విచారించారు. ఈ కేసులో కందుల ప్రవీణ్ మెయిల్ ఐడి ద్వారా హరిణి లక్ష్మి తనను 5 సంవత్సరంలో నుంచి ప్రేమిస్తున్న విషయం 2021 హైదరాబాదులో పది నెలలు కలిసి ఉన్న విషయాన్ని అలాగే ఆ యువతి అమెరికాకు చదువుకోవటానికి వెళ్లిన విషయాన్ని పెళ్లి విషయంలో వచ్చిన కులం అంతరాలని తాను చనిపోతే హరిణి లక్ష్మి కారణమని తన మెయిల్ ద్వారా పేర్కొన్న విషయం కూడా ఖీ×= ఉన్నది 2019 వ సంవత్సరంలో హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న కందుల ప్రవీణ్ కు ఒంగోలుకు చెందిన హరిని లక్ష్మి పరిచయమై ప్రేమగా మారి అమెరికా వెళ్లటానికి ప్రవీణ్ దగ్గర లక్షల రూపాయలు డబ్బు వాడుకున్నది. హరిణి లక్ష్మి కి అమెరికాలో యామిని చౌదరితొ స్నేహం ఏర్పడి ప్రవీణ్ డబ్బులు పంపనప్పుడు ఆ యువతులు ఇద్దరూ కలసి కులపరంగా మానసికంగా అవమానించి బాధపెట్టి భయపెట్టారు. ఈ విషయాన్ని ప్రవీణ్ తన ఇంట్లో వాళ్లకు కూడా చెప్పాడు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినందున తెలుగుదేశం పార్టీకి చెందిన యువతుల తల్లిదండ్రులు ఒంగోలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రవీణ్ పై ఫిర్యాదు చేయడం జరిగింది. ఒంగోలు టూ టౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించి పంపించడం జరిగింది. తరువాత హరిని లక్ష్మి, యామిని చౌదరి వేరు వేరు ఫోన్ నెంబర్ల ద్వారా ఫోన్లు చేసి ప్రవీణ్ కుటుంబ సభ్యులను సోషల్ మీడియా ద్వారా అవమాన పరుస్తామని హరిణి లక్ష్మి తండ్రి తిరుమల రావు అతని కుటుంబ సభ్యులు బెదిరించారు అన్నారు. ఈ క్రమంలో తనను ప్రేమ పేరుతో మోసం చేసి ఆర్థికంగా నష్టపరిచి అమెరికా వెళ్ళిపోయి తనను కులం పేరుతో దూషించి అవమానించారని బెదిరించారని ప్రవీణ్ కుంగిపోయాడు మరల ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్కు పిలిపించి తనపై తప్పుడు ఆరోపణలు చేశారని అవమాన భారంతో ఆవేదన చెందాడు. గత సంవత్సరం జనవరి 15వ తేదీన ఒప్పుకుండూరు లోని తన సొంత ఇంటిలో కందుల ప్రవీణ్ బలవన్ మరణం చెంది సంవత్సరం కాలం దాటింది. కేసు ఇన్వెస్టిగేషన్ అధికారి అయిన ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు సాక్షులను విచారణ జరిపి కూడా సంవత్సరం కాలమైంది. కానీ ఈ కేసులో ముద్దాయిలను ఎవరిని ఎంతవరకు అరెస్టు చేయలేదు. ఇతరుల వలన ఎవరైనా వేరొక వ్యక్తి బలవన్మరణం చెందితే దీటీూ సెక్షన్ 108 ప్రకారం 10 సంవత్సరముల వరకు జైలు శిక్ష విధించవచ్చు. ఇటువంటి కేసుల్లో పోలీసు అధికారులు సాధారణంగా ఎటువంటి కాలయాపన చేయరు. కానీ ఈ కేసులోని ముద్దాయిలు తెలుగుదేశం పార్టీకి చెందినవారైనందున ఎవరిని అరెస్టు చేయలేదు. కావున ఈ కేసులో ఒంగోలు డిఎస్పి అలసత్వం వహిస్తున్నందున ఈ కేసును కనిగిరి డిఎస్పికి ఇన్వెస్టిగేషన్ అప్పగించవలసినదిగా దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, పత్రా బంగారం, ఇట్టా కోటేశ్వరరావు, మృతుని తండ్రి కందుల డానియల్, దేవరపల్లి గోపి, తదితరులు ఉన్నారు.

## ఆర్టీఐ చీఫ్ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జనవరి 21)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ నూతన చీఫ్ కమిషనర్‌గా ఎంపికైన వజ్జా శ్రీనివాసరావు కు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు ఆర్టీఐ కీలకమైన సాధనమని అన్నారు. వజ్జా శ్రీనివాసరావు వంటి అనుభవజ్ఞులు చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని మరింత సులభంగా, వేగంగా అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా చీఫ్ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారాన్ని సామాన్య ప్రజలకు చేరవేయడమే తన ప్రధాన లక్ష్యమని, సమాచార హక్కు చట్టాన్ని ప్రజలకు మరింత ప్రయోజనకరంగా అమలు చేయడం పై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో ఆర్టీఐ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసి, ప్రజలకు న్యాయం, పారదర్శకత, జవాబుదారీ తనం మరింత బలపడతాయని ఎమ్మెల్యే ఏలూరి ఆశాభావం వ్యక్తం చేశారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

22.01.26 గురువారం


## ఆక్వా పార్కు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆక్వా పార్కు, గ్రామీణ వైద్యశాలలు, పాఠశాలలు, వసతి గృహాల నిర్మాణ పనులపై సంబంధితశాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. నిజాంపట్నంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు నిర్మాణం, ఫిషింగ్ హార్బర్ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. మత్స్యకారుల కోసం రూ.2.64 కోట్లతో నిర్మిస్తున్న ఫెసిలిటీ సెంటర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామీణ వైద్యశాలల నిర్మాణాలకు ఏపీఎంఐడిసి ఇంజినీరింగ్ అధికారులు వేగంగా అంచనాలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కింద జిల్లాకు 173 వైద్యశాలలు మంజూరు కాగా, 38కి స్థలాలు వారంలో కేటాయింపులు జరగాలన్నారు. పది రోజుల్లో అంచనాలు రూపొందించి, నెల రోజుల్లో పనులు మొదలు పెట్టాలన్నారు. ఆరోగ్య అభియాన్ పథకం కింద చేపట్టిన వైద్యశాలల అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. వైద్య విధాన పరిషత్ కింద రూ.37.84 లక్షలతో భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆయుష్ శాఖ కింద మంజూరైన రూ.60 లక్షలను (తరువాయి 4లో...)

# ఒంగోలు ఎద్దులే ఆంధ్రప్రదేశ్ గర్వకారణం

### ఎడ్ల బల ప్రదర్శన పోటీలతో రైతుల్లో ఉత్సాహం
### జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో ఎమ్మెల్యేలు ఏలూరి, కందుల




(షణ్ముఖ వెలుగు, చిలకలూరిపేట, జనవరి 21)

ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన ఒంగోలు జాతి ఎద్దులు మన రాష్ట్రానికి గర్వకారణమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని గోల్కొండ గార్డెన్స్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల 4వ రోజు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెజిల్ దేశ ఆర్థిక పరిస్థితిని పూర్తిగా మార్చేసిన పశుజాతి మన ఒంగోలు జాతి ఎద్దులేనని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన ఈ జాతిని సంరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఇటువంటి పోటీలు రైతుల్లో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా, దేశీ పశుసంపద విలువను సమాజానికి తెలియజేస్తాయని చెప్పారు.తొలుత ఎమ్మెల్యే ఏలూరికి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి పండుగ ముగిసినప్పటికీ చిలకలూరిపేటలో పండుగ వాతావరణం కొనసాగుతుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రత్తిపాటి పుల్లారావు చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రత్యేకతతో, విలక్షణంగా ఉంటుందన్నారు. జాతీయస్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీల నిర్వహణ ప్రశంసనీయమని పేర్కొన్నారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రత్తిపాటి పుల్లారావు రాష్ట్రంలో ఎన్నో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వ్యవసాయం పట్ల ఆయనకున్న మక్కువకు నిదర్శనమే ఈ ఎడ్ల బల ప్రదర్శన పోటీలు అన్నారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలు ఎన్నికల ముందు మాత్రమే నిర్వహిస్తారని, అయితే ఎన్నికల సమయం కాకపోయినా ఎన్నో ఏళ్లుగా నిరంతరంగా ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ పోటీల ద్వారా ఈ ప్రాంత రైతాంగానికి మంచి సందేశం అందుతోందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దక్షిణ భారతదేశం అంతటా గుర్తింపు పొందే స్థాయిలో ఈ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. వేలాది మంది రైతులను ఉత్సాహపరుస్తూ ఆనందాన్ని పంచుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రం గర్వపడేలా నిర్వహిస్తున్నందుకు చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీలను రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఈవెంట్ గా నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడాలని సూచించారు. (తరువాయి 4లో...)

## గుంతలు రహిత రహదారుల నిర్మాణం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)

గుంతలు రహిత రహదారుల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జాతీయ, రాష్ట్రీయ రహదారుల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, మరమ్మతు పనులపై సంబంధితశాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్ష నిర్వహించారు. బాపట్ల జిల్లా పురోభివృద్ధిలో పయనిస్తుందని కలెక్టర్ చెప్పారు.

ఇందు కొరకు రాష్ట్ర ప్రభుత్వం గుంతలు రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో గుంతల రహిత రహదారుల కొరకు ఎస్ హెచ్ కింద రూ.48.51 లక్షలు, ఎండి ఆర్ కింద మరో రూ.43.60 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే చీరాల సబ్ డివిజన్ పరిధిలో 362.61 కిలోమీటర్ల మేర గుంతల రహిత రహదారులకు రూ.2.81 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయన్నారు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆరా తీశారు. అలాగే ఆర్ అండ్ బి రహదారులు నిర్మాణం, విస్తరణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయన్నారు. వీటికి రూ.51.75 కోట్ల నిధులు వచ్చాయన్నారు. జాండ్రపేట-వేటపాలెం-బాపట్లను కలుపుతూ రూ.3.50 కోట్లతో రహదారిని, పెనుమూడి-లంకవానిదిబ్బకు రూ.10.20 కోట్లతో రహదారిని నిర్మిస్తున్నామన్నారు. రూ.4.75 కోట్లతో కర్లపాలెం-గణపవరం రహదారిని, రూ.2.50 కోట్లతో బేతపూడి-పల్లెకోన రహదారిని, రూ.3.00 కోట్లతో చందోలు-నిజాంపట్నం రహదారిని, రూ.ఒక కోటితో తెనాలి-చందోలు రహదారిని, రూ.6.00 కోట్లతో అల్లూరు-మాచవరం రహదారిని నిర్మిస్తారన్నారు. రూ.4.00 కోట్లతో బ్రాహ్మణ కోడూరు- భట్టిప్రోలు రహదారిని, రూ.3.00 కోట్లతో రేపల్లె-నిజాంపట్నం రహదారిని, రూ.8.80 కోట్లతో పర్చూరు-పెద్ద జాగర్లమూడి రహదారిని, రూ.ఐదు కోట్లతో బాపట్ల-పర్చూరు రహదారిని త్వరగా నిర్మించాలన్నారు. రైల్వే లైన్ ద్వారా ప్రమాదాల నివారణకు జిల్లాలో 24 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.1,440 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. రహదారులకు ఆటంకం లేకుండా ఆర్ ఓ బి లు ఉపకరిస్తాయన్నారు. ఈ ఆర్ ఓ బి లు త్వరగా నిర్మించాలని సూచించారు. ఎన్ హెచ్ ఏ-167ఏ నిర్మాణంలో ఈపురుపాలెం వద్ద ఆరోబికి సాంకేతిక అనుమతులు త్వరగా ఇప్పించాలని సికింద్రాబాద్ లోని డిఆర్ఎం కి ఫోన్లో మాట్లాడారు. నిర్మాణాలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రైల్వే ఇంజనీర్ సుదర్శన్, ఆర్అండ్‌బి డీఈలు నలిని, అరుణ్ కుమారి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, అనుబంధశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయం, సత్వర స్పందనతో ఏ సమస్యనైనా సమర్థంగా ఎదుర్కోవచ్చు

### రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 21)







సమన్వయం, సత్వర స్పందనతో ఎలాంటి సమస్యనైనా సమర్థంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి చెప్పారు. మొంథా తుఫాన్ సమయంలో ప్రాణ నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం స్పందించిన తీరే దీనికి నిదర్శనమన్నారు. ఈ తుఫాన్ సమయంలో ఎదురైన పరిస్థితులను, వాటిని అధిగమించిన అనుభవాలను జిల్లా కలెక్టర్ పి రాజాబాబు డాక్యుమెంటేషన్ చేయించారు. మంత్రి స్వామితో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ బుధవారం ప్రకాశం భవనంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొనేందుకు తన అనుభవంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముఖ్యమంత్రి శ్రీ.నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రస్థాయి నుంచి దిశ నిర్దేశం చేశారన్నారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో అధికార యంత్రాంగం సమన్వయంతో స్పందించిందని మంత్రి అభినందించారు. ఈ తుఫాన్ సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంతవరకు అధికారులు తగ్గించగలిగారని కొనియాడారు. విద్యుత్ సరఫరా, ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరణ, రోడ్లపై కూలిన చెట్లను గంటల వ్యవధిలోనే తొలగించి సమస్యను పరిష్కరించారని మంత్రి చెప్పారు. అధికంగా వచ్చిన నీటిని చెరువులను నింపేందుకు మళ్లించడం ద్వారా వాటర్ మేనేజ్మెంట్ కూడా అద్భుతంగా చేశారని గుర్తు చేశారు. జిల్లా చరిత్రలోనే కనీవినీ ఎరుగని స్థాయిలో విరుచుకుపడిన తుఫానును సమర్థంగా ఎదుర్కొన్న అనుభవాలను పుస్తక రూపంలో అందుబాటులో ఉంచడం ద్వారా భావితరాలకు ఒక మార్గనిర్దేశంగా ఉంటుందని మంత్రి చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం ద్వారా మొంథా తుఫాను ఇబ్బందులను సత్వరమే తొలగించగలిగామని అన్నారు. ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవడం ద్వారా సమస్యను త్వరగా పరిష్కరించగలిగామన్నారు. (తరువాయి 4లో...)

## బెయిల్ పై వచ్చిన వ్యక్తి హత్య

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 21)

జైలు నుంచి వచ్చిన వ్యక్తిని అనుమాన స్పందంగా మృతి చెందిన సంఘటన పెద్దారవీడు మండల కేంద్రంలో అంకాలమ్మ గుడి వద్ద బుధవారం రాత్రి చోటు చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దదోర్నాల మండలం దో ర్నాల గ్రామానికి చెందిన అడప లాలు (41) హత్యకు గురైన వ్యక్తి గంజాయి కేసులో ముద్దాయిగా ఉండి గత నెల క్రితం జైలుకు వెళ్లి బెయిల్ పై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో మార్కాపురం నుంచి దోర్నాలకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో గుర్తు తెలియని దుండగులు కారు ఎక్కించుకొని పెద్దారవీడు అంకాలమ్మ గుడి వద్ద కారు నిలిపివేసి కళ్ళల్లో కారం కొట్టి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. మృతుడికి భార్య ఝాన్సీ, ఇద్దరు సంతానం ఉన్నట్లు బంధువులు తెలిపారు. సంఘటన స్థలానికి పెద్దారవీడు ఎస్ఐ సాంబయ్య చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## పర్యాటక అభివృద్ధి పనులు ముమ్మరంగా ముందుకు వెళ్తున్నాం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)

పర్యాటక అభివృద్ధి పనులు ముమ్మరంగా ముందుకు వెళ్తున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నూతనంగా



ఏర్పాటు చేసిన జిల్లా పర్యాటక శాఖ కార్యాలయాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. పర్యాటకరంగంగా బాపట్ల జిల్లా అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో జిల్లా పర్యాటకశాఖ అధికారిగా షేక్ అలి అస్గర్ ను ప్రభుత్వం నియమించిందని కలెక్టర్ చెప్పారు. పర్యాటక రంగం అభివృద్ధికి సలహాలు, నిర్ణయాలు, అమలు, పర్యవేక్షణ చేసే అధికార బృందాన్ని బాపట్లలో మరింత బలోపేతం చేశామన్నారు. ఇకనుంచి పర్యాటక ప్రాంతాల అభివృద్ధి మరింత వేగంతో క్రియాశీలంగా ముందుకు వెళ్తాయని చెప్పారు. పర్యాటకశాఖ కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో పర్యాటకశాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ లో ప్రారంభించినట్లు తెలిపారు. ఆ శాఖకు అధికారితో పాటు మరో ముగ్గురు ఉద్యోగులను ప్రభుత్వం నియమించిందన్నారు. కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్లు, కుర్చీలు, టేబుల్లు, ప్రింటర్లు తదితరమైనవి సమకూర్చామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యాటకులు, జిల్లాలోని ప్రజలు ఎవరికైనా ఏదైనా సందేహాలు ఉంటే జిల్లా పర్యాటక శాఖ అధికారిని సంప్రదించవచ్చున్నారు. పర్యాటక శాఖ అధికారి 6302379835ను ప్రభుత్వ కార్యాలయాల పని వేళల్లో కాల్ చేయవచ్చున్నారు. సూర్యలంక, వాడరేవు, పాండురంగాపురం, రామాపురం బీచ్‌ల లభివృద్ధితో పర్యాటక రంగం మరింత ప్రాచుర్యంలోకి రానుందన్ని చెప్పారు. ఆయన వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి షేక్ అలి అస్గర్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పరిసరాలను పాడు చేయవద్దు


### సిఐ సుబ్బారావు, ఎస్ఐ సైదుబాబు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 21)

మార్కాపురం పట్టణంలోని సాయి బాలాజీ థియేటర్ పరిసర ప్రాంతాలలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, ఎస్ఐ సైదుబాబు తన సిబ్బందితో కలిసి మద్యం సేవించి పరిసరాలను అపరిశుభ్రం చేసిన ప్రదేశాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో గల చెత్తను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేపించి నిప్పంటించారు. నివాసాల నడుమ బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని ఆ ప్రాంత ప్రజలకు సూచించారు.

## చదువుల తల్లికి అండగా మానవత




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 21)

పొదిలి మానవత అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ నేడు బి టెక్ చదువుతున్న పేద ముస్లిం విద్యార్థినికి అండగా నిలిచి దాతలు, మానవత డైరెక్టర్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు ఆర్థిక సహాయంతో పొదిలి సీఐ రాజేష్ కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, వారి తల్లి మానవత కు గునుపూడి చెంచు సుబ్బారావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెలిశెట్టి వెంకటేశ్వర్లు, చైర్మన్ కాటూరి వెంకట నారాయణబాబు, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు కాకునూరి యలమందారెడ్డి, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, ఏఐ అశోక్ బండి, డైరెక్టర్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వరికుంట్ల వినోద్ రాజ్, భూమా సుమంత్, ప్రసాద్, రంకెల రెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, ఫజిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయం, సత్వర స్పందనతో ఏ సమస్యనైనా సమర్థంగా ఎదుర్కోవచ్చు











ఈ అనుభవాలను డాక్యుమెంటేషన్ ద్వారా భావితరాలకు ఒక దిక్సూచిగా ఉంటుందన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తుఫాను అతి తీవ్రమైనదైనప్పటికీ దాని వలన కలిగే నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించగలిగామన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు చరిత్రలోనే గరిష్ట స్థాయిలో వరద వచ్చినప్పటికీ సమర్థంగా నియంత్రించగలగటం గొప్ప విషయం అన్నారు. ఈ ప్రాజెక్టుకు గేట్లను బిగించే విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న సత్వర నిర్ణయం, విపత్తుల సమయంలో అధికార యంత్రాంగం త్వరగా స్పందించడం వలన రోజుల వ్యవధిలోనే పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురాగలిగామన్నారు. ఉడా ఛైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్న పొలిటికల్ గవర్నెన్స్ వలన నష్ట తీవ్రతను తగ్గించగలిగామన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ తుఫాను సమయంలో మున్సిపల్ సిబ్బంది చేసిన సేవలను కొనియాడారు. పోతురాజు కాలువలో రూ.80 లక్షలతో పూడికతీత పనులను మే నెలలోనే చేపట్టడము ద్వారా నష్టాన్ని సాధ్యమైనంతగా తగ్గించగలగామన్నారు. ఈ దిశగా కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సమస్య ఉన్న ప్రాంతాన్ని జియో కోఆర్డినేట్స్ ఆధారంగా గుర్తించి, ఫోటోలు వీడియోలతో డాక్యుమెంటేషన్ చేయించానన్నారు. జిల్లాపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిన ఈ తుఫానుకు సంబంధించిన అనుభవాలను మండలాల వారీగా క్రోడీకరించి రూపొందించిన ఈ పుస్తకం, భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కొనడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొనడములో అనుభవాలను క్రోడీకరించి పుస్తక రూపంలో తీసుకురావటం ఇదే మొదటిసారి కావచ్చు అని అన్నారు. తుఫాన్ సమయంలో సమన్వయంతో వ్యవహరించటం వలన సత్వరమే ప్రజలకు ఊరట కలిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ఎదురైన పరిస్థితులను గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వాటిని సమర్థంగా ఎదుర్కొనేలా అనుభవాలకు అక్షర రూపాన్ని ఇవ్వటం ద్వారా మార్గాన్ని సులభతరం చేస్తుందన్నారు. తుఫానుకు ముందు, తుఫాన్ సమయంలో ఎదురైన సమస్యలను, పరిస్థితిని సత్వరమే చక్కదిద్దడం ద్వారా ఆ తర్వాత నెలకొన్న పరిస్థితులను తెలియజేసేలా రూపొందించిన వీడియోను ప్రజా ప్రతినిధులు వీక్షించారు. ఫోటో ఎగ్జిబిషన్‌ను కూడా తిలకించారు. కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లను ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి చిన ఓబులేసు, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఒంగోలు ఎద్దులే ఆంధ్రప్రదేశ్ గర్వకారణం



అనంతరం ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో విజయం సాధించిన ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వెంకటేశ్వరస్వామి శాలువతో ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి తోపాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమిటీ ప్రజాప్రతినిధులు తేళ్ల సుబ్బారావు, తుబాటి శ్రీహరి, వెంకటేశ్వర్లు, రైతులు, ఎడ్ల యజమానులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోటీదారులు, పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.

## ఆక్వా పార్కు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

సంబంధిత వైద్యశాలల భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. చీరాలలో క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆర్టిజం, భవిత సెంటర్లు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్, వర్షపు నీటి ఇంకుడు గుంతలు, క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలన్నారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు మంజూరైన రూ.2.86 కోట్ల నిధులతో పనులు వేగంగా ప్రారంభించాలన్నారు. టెండర్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. వసతి గృహ భవనం చుట్టూ ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ జెడి గాలి దేముడు, డీఈవో శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, డి సి హెచ్ ఎస్ కోఆర్డినేటర్ పద్మావతి, పి ఆర్ ఈ ఈ రాజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## రైలు బండ్ల స్టాపులను వెంటనే పునరుద్ధరించాలి

### తర్లుపాడు మండల ప్రజల సమస్యలను రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవకు వినతి




(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జనవరి 21)

టెక్నికల్ తనిఖీలలో భాగంగా బుధవారం మార్కాపురం రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తర్లుపాడు మండలంలోని పలువురు ప్రముఖులు, నేతలు, ప్రజలు, తర్లుపాడు మండల యువకులు తర్లుపాడు రైల్వే స్టేషన్‌లోని రైలుబండ్ల స్టాపుల సమస్య గురించి జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ దృష్టికి వినతి పత్రం ద్వారా తీసుకెళ్లారు. గతంలో కరోనా కాలానికి ముందు తర్లుపాడు రైల్వేస్టేషన్లో పలు రైళ్లు 17225,17226 - హుబ్లీ - నర్సాపూర్ - హుబ్లీ , 17253 - గుంటూరు - చత్రపతి శంభాజీ నగర్, 17228 - గుంటూరు - డోన్, నంబరు గల రైలుబండ్లు తర్లుపాడు మండల కేంద్రంలోని స్థానిక రైల్వే స్టేషన్ లో పైన తెలిపిన అన్ని రైలుబండ్లకు స్టాపులు ఉండేవని తెలిపారు.మండలంలో దాదాపు చుట్టుపక్కల 25 గ్రామాల నుండి ప్రజలు,దేశ రక్షణలో భాగమైన సైనికులు,విద్య కోసం,వైద్యం కోసం,వ్యాపారాల కోసం,వివిధ వృత్తుల కోసం నిత్యం ప్రజలు తర్లుపాడు రైల్వే స్టేషన్ నుండి ప్రయాణాలు కొనసాగించే వారిని జీఎం దృష్టికి తీసుకెళ్లారు.కరోనా కాలం నుండి రైల్వే అధికారులు హఠాత్తుగా ఉన్న స్టాపులను ఎత్తివేయడంతో ప్రజలకు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుందని,ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వాలు, రైల్వేలు ప్రజలకు ఉపయోగపడనప్పుడు ఎందుకని ప్రజలు రైల్వే అధికారులను ప్రశ్నించారు.తమ మండల ప్రజలకు కలిగిన తీవ్ర ఇబ్బందులను గమనించి నిలిపివేయబడిన రైల్వే స్టాప్ లను వెంటనే పునరుద్ధరించాలని,కొత్తగా తిరుపతికి వెళ్లేందుకు భక్తుల కోసం, వైద్యం కోసం,కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం,ప్రజల కోసం గుంటూరు వెళ్లడానికి 17261,17262 గుంటూరు - తిరుపతి - గుంటూరు బండికి కూడా నూతనంగా స్టాప్ మంజూరు చేయాలని,తమ మండల ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు నేతలు,ప్రజలు వినతి పత్రం ద్వారా జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ షేక్ మహబూబ్ వలి, వెలుగు కాశీరావు, షేక్ అఫ్రోజ్, షేక్ బాషా, వెన్నా రాజారామిరెడ్డి, షేక్ చిన్న ఖాసీంవలి, షేక్ సిలార్సా, రొడ్డ వెలుగొండయ్య, పఠాన్ కరీముల్లా, వెలుగు రమేష్, కొండెబోయిన వర్ధన్, గంజరపల్లి మహేష్, కొండెబోయిన సునీల్, గుంటూ మోషే, గాలి నెమలిరెడ్డి, వెలుగు క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నారి సీఆర్‌పీలకు శిక్షణ కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 21)

మండల కేంద్రమైన పొదిలి పట్టణంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఈ నారి, సీఆర్‌పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశం జెండర్ ప్రతిజ్ఞతో ప్రారంభించి, మన డబ్బులు -మన లెక్కలు గురించి, సమాజం లో సామజిక అసమానతలు, అనెక్సర్ 2 గురించి, మన డబ్బులు -మన లెక్కలు యాప్‌లో పొదుపులు, లోన్స్, సిఐఎఫ్, ఎస్‌ఎన్ ఉన్నతి మొదలైన లోన్స్, సంఘ సభ్యుల అన్ని వివరాలు రాయాలని, రాసిన వివరాలు మొబైల్ బుక్ కీపింగ్ యాప్ నందు ఈ నారిలు, విఓఏలు నమోదు చేయాలని ఏపీఎం గోపాల కృష్ణ తెలిపారు. మొదటి రోజు పొదిలి క్లస్టర్ పరిధిలో వారికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో సీసీలు రాజయ్య, దాసు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నిసా బేగం, కార్యదర్శి అరుణ, కోశాధికారి సులోచన, అకౌంటెంట్ శ్రీదేవి, వీవోఏలు, ఈ నారిలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక వెబ్ సైట్






షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)
ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. వివిధ శాఖల జిల్లా అధికారుల సమావేశంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో బుధవారం ఆయన చర్చించారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా విరాళాలు ఇవ్వడానికి, వారి కార్యాలయంలో అవసరమైన ఫర్నిచర్ పొందడానికి ఒక వేదికగా ఈ వెబ్ సైట్ నిలుస్తుందని కలెక్టర్ చెప్పారు. అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ఈ వెబ్ సైట్‌లో లాగిన్ అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. తమ కార్యాలయాలలో ఫర్నిచర్, లేదా కంప్యూటర్లు, లేదా కుర్చీలు, ప్రింటర్లు, వంటివి అవసరమైతే ఆ వెబ్ సైట్ లో నిక్షిప్తం చేయాలన్నారు. అది చూసిన వారెవరైనా సహకరించవచ్చన్నారు. ప్రభుత్వ అధికారులంతా ఇందులో భాగస్వాములయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. అధికారులంతా సమిష్టిగా పనిచేయడానికి వేదికగా ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ వైద్యశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ఈ వెబ్ సైట్ వేదికగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అంతా మేలు జరుగుతుందన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు ఏదైనా సమస్య వచ్చినా, పుస్తకాలు, నోట్ బుక్స్, దుప్పట్లు, గీజర్, ఫ్యాన్లు, మంచాలు, తదితర వస్తువులేమైన అవసరమైతే ఈ వెబ్ సైట్ లో సంబంధిత అధికారి నమోదు చేస్తారన్నారు. అలానే వైద్యశాలలో దుప్పట్లు, ఫ్యాన్లు, ఫినాయిల్, తదితరమైనవి అవసరమైతే ఇందులో స్పష్టమైన వివరాలతో నిక్షిప్తం చేయవచ్చన్నారు. ఏ అధికారైనా విరాళంగా ఇవ్వాలనుకుంటే తక్షణమే స్పందించి ఇవ్వడానికి సదరు అధికారులను సంప్రదించవచ్చన్నారు. ప్రజలకు సేవ చేసే గొప్ప భాగ్యం, అవకాశం అధికారులకు ఇక్కడ దొరుకుతుందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని బాపట్ల జిల్లాలోని అన్ని శాఖల అధికారులను అనుసంధానిస్తూ వెబ్ సైట్ రూపొందించాలని సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, నూతనంగా నియమితులైన బాపట్ల జిల్లా ఐటి మేనేజర్ లక్ష్మీవెంకట గోపీనాథ్ లకు సూచించారు.

## కరేడు కేజీబీవీని సందర్శించిన వైద్యాధికారి అనిల్‌కుమార్







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 21)
మండలంలోని కరేడు గ్రామ కేజీబీవీ, ఏపీటీ డబ్ల్యూ ఆర్ బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్‌ను కరేడు వైద్యాధికారి డాక్టర్ ఏ అనిల్ కుమార్ బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి చిన్న వ్యాధులకు చికిత్స చేయడం జరిగింది. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత గురించి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించడం జరిగింది. సీజనల్ వ్యాధులు గురించి వివరించడం జరిగింది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, హెచ్ఎస్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పి జరీనా, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

డాక్టర్ బత్తుల బాలకృష్ణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 21)
మండలం పరిధిలోని మున్నవారి పాలెం గ్రామ పంచాయతీ నందు మండల పశు వైద్యాధికారి డాక్టర్ బత్తుల బాలకృష్ణ బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం క్యాంపు నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరం నందు గ్రామంలోని 152 పాడి పశువులకు, 47 దూడ లకు డీవార్మింగ్ మందు ఉచితంగా పంపిణి చేసారు. 17 పశువులకు గర్భకోశా వ్యాధులకు చికిత్స, కృత్రిమ గర్భదారణ చేయటం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బత్తుల బాలకృష్ణ మాట్లాడుతూ పాడి రైతులు సకాలంలో టీకాలు వేపించుకోవాలని, పశుభీమా అతి తక్కువ కె ప్రభుత్వం అధింస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పాడి రైతు లకు ఉచితంగా గడ్డి పెంపకం చేపట్టవచ్చు తేలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ బత్తుల బాలకృష్ణ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సిహెచ్ కిషోర్, పశు సంవర్ధక సహాయకుడు కుమార్, గోపాల మిత్ర వెంకట రామయ్య పాల్గొన్నారు.

## మహా శివరాత్రి తిరుణాల ఏర్పాట్లు పై అధికారులతో సమావేశం

అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి

ఆర్డీఓ శివరామిరెడ్డి, టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు






(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జనవరి 21)
మహాశివరాత్రి ఏర్పాట్లు ఘనంగా భక్తి శ్రద్ధలతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని మార్కాపురం ఆర్డీఓ శివరామిరెడ్డి, టిడిపి వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులకు సూచించారు. త్రిపురాంతకం మండలంలోని అమ్మవారి ఆలయ సమీపంలో శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఏర్పాట్లకు సంబంధించి ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెవిన్యూ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.ముందుగా అధికారులు మాట్లాడుతూ తాము నిర్వయించే పనులు చేయవలసిన వీధుల వివరాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శివరామిరెడ్డి మాట్లాడుతూ నేషనల్ హైవే వారు ముందస్తు గుడికి వెళ్ళే దారిని సూచించే బోర్డు ఏర్పాటు చేయాలి అన్నారు. ఎన్ఎస్పీ అధికారులు భక్తులు స్నానాలు ఆచరించే సాగర ప్రధాన కాల్వ వద్ద స్నానం ఘాట్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు భద్రత ఏర్పాట్ల పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఘనంగా భక్తి శ్రద్ధలతో శివరాత్రి ఏర్పాట్లు నిర్వహించాలన్నారు. ఈ నెల 26 మార్కాపురం జిల్లా కేంద్రంలో మొదటిసారి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఎవ్వరు వేలెత్తి చూపించే పరిస్థితి తీసుకురావద్దని అధికారులు, నాయకులకు సూచించారు. రూ.9 కోట్ల రూపాయలతో వైపాలెం నుండి త్రిపురాంతకం తారు రోడ్ నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. శివరాత్రి పండగలోపు నూతన్ రోడ్ పై ప్రయాణికులు ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామన్నరు. గతంలో సరైన పోలీసు సిబ్బంది లేక చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని, అవి మరలా జరగకుండా చూసుకోవాలన్నారు. శైవక్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు. మరలా 2వ సమీక్ష సమావేశం ఉంటుందని, దానికి మీరు చేసిన పనులు, చేయవలసిన పనులను వివరించవలసి వుంటుందన్నారు. సమావేశానికి గైర్హాజరైన వారికి నోటీసులు అందించాలని తహసీల్దార్‌కు సూచించారు. శివాలయం అమ్మవారి టెంపుల్ వద్ద చీకటి కనిపించకుండా చూడాలని విద్యుత్ అధికారులకు తెలిపారు. వారం రోజులలో నివేదిక అందిస్తే ప్రత్యేక గ్రాంట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్ పైన ఉన్న దుకాణాలు ప్రత్యేక ప్రదేశాలలో ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రద్దీ వలన సరైన సమయంలో పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొనలేకపోతున్నామని తెలుపుతున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా దేవాదాయశాఖ అధికారి జి శ్రీధర్‌రెడ్డి, ఈఓ అనిల్ కుమార్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపిడిఓ రాజ్ కుమార్, ఎన్ఎస్పీ డిఈ విజయలక్ష్మీ, సిఐ అస్సాన్, అన్ని శాఖల అధికారులు, ఎంపిపి ఆళ్ల సుబ్బమ్మ, సర్పంచ్ పొన్నం వెంకట లక్ష్మి, తెలుగుదేశం పార్టీ మండల మాజీ కన్వీనర్ మోటకట్ల శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మేకల వలరాజు, తెలుగు యువత మండల అద్యక్షుడు చంటి, అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## స్వదేశీ దర్శన్ ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)
స్వదేశీ దర్శన్ ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్టు నిర్మాణ పనులపై బుధవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు వడివడిగా కొనసాగించాలని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి 2026వ సంవత్సరం బంగారు సంవత్సరంగా నిలుస్తుందన్నారు. పర్యాటక రంగం మాస్టర్ ప్లాన్ లో గుర్తించిన రాష్ట్రీయ రహదారుల అభివృద్ధికి వేగంగా అంచనాలు రూపొందించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సూర్యలంక, వాడరేవు, పాండురంగాపురం, రామాపురం బీచ్ లు మరింత ప్రాచుర్యంలోకి రానున్నాయని వివరించారు. ఇప్పటికే జాతీయ రహదారులు అనుసంధానం అవుతున్నాయన్నారు. హౌస్ బోట్ ఏర్పాటు, పేరలి కాల్వ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వేగంగా అనుమతులు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. జల వనరుల శాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి వేగంగా అనుమతులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించిన నేపథ్యంలో వడివడిగా పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఫిష్ ఆంధ్ర యూనిట్లు సూర్యలంకలో తక్షణమే గ్రౌండింగ్ చేయాలన్నారు. హరిత రిసార్ట్స్ లో సమావేశ మందిరం త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇప్పటికే ఫర్నిచర్ వచ్చినందున పర్యాటకులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి షేక్ అలి అస్గర్, బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ప్రాజెక్ట్ మేనేజర్, అనుబంధ శాఖ అధికారులు వీక్షణ సమావేశం ద్వారా పాల్గొన్నారు.



## రాష్ట్రంలో శరవేగంతో సంక్షేమం, అభివృద్ధి

ఎర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం రోడ్డుకు రూ.7 కోట్లు మంజూరు

కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించిన టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు







(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 21)
నియోజకవర్గంలో ఎర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం మండలానికి గల గ్రామాలలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం కు తారు రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లతో మంజూరైన రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు సారాద్యంలో రాష్ట్రం అభివృద్ధి పథకంలో దూసుకుపోతుందన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులు ఏడాదిలోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రతిపక్షం చేసే ఆరోపణలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఎర్రగొండపాలెం పట్టణంలో ఉన్నటువంటి డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరు సుబ్బారావు, వైపాలెం మండల కన్వీనర్ చిట్యాల వెంగల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీజే పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన గుంటూరు రాంబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)
టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక సమత మహిళా వృధాశ్రమంలో వృద్ధులకు బిసి నాయకులు గుంటూరు రాంబాబు ఆధ్వర్యంలో దుప్పట్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఒంగోలు నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నటువంటి జనార్ధన్‌రావుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనిజేటి రామకృష్ణ, మాచవరపు అజయ్ బాబు, బుసరపల్లి శ్రీనివాసులు, ఆనంగి సురేష్, కలవకూరి శివ, కారావాది వేణు, కందుకూరు యోగ మూర్తి, గోనుగుంట శేషరత్నం, వెంకట రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్‌లకు నిధులు లేకుండా చైర్మన్‌లను ఎందుకు నియమించారు?

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 21)
బీసీ కార్పొరేషన్ లకు నిధులు లేకుండా చైర్మన్ లను ఎందుకు నియమించారు చంద్రబాబు నాయుడు అని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నూటికి 50% గా ఉన్నటువంటి బీసీలకు కులాల వారీగా బీసీ కార్పొరేషన్ చైర్మన్‌లను, డైరెక్టర్లను నియమించి అర్ధ రూపాయి నిధులు కేటాయించకుండా కార్పొరేషన్ ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి బీసీలే కారణం అని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు లేకుండా బీసీలను మోసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఎన్నికల సందర్భంగా బీసీ రక్షణ చట్టం తెస్తానన్నారు. నేటికీ అమలు పరచలేదని, అలాగే 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్ బీసీలకు ఇస్తామన్నారు. అది నేటికీ అమలుపరచలేదని, ఈ విధంగా బీసీలను దగా చేస్తూ కాలం గడుపుతున్న చంద్రబాబునాయుడుకి రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తుందని శ్రీనివాసులు తెలిపారు. కార్పొరేషన్లకు నిధులు లేవు, సంక్షేమ పథకాలకు నిధులు లేవు కానీ ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.1700 కోట్లు ఖర్చు పెడతామని ప్రకటించిన చంద్రబాబు నాయుడుకి తగదన్నారు. ఒక వ్యక్తి కోసం ఇన్ని కోట్లు పెట్టటం అవసరమా అని ప్రశ్నించారు. నూటికి 50 శాతంగా ఉన్న బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా, రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా ప్రజలను మోసం చేయటం ఏమిటని ప్రశ్నించారు.

## ఈనారి, సిఆర్పిలకు శిక్షణ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 21)
మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వెలుగు డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో ఏపీఎం సుబ్బారావు అధ్యక్షతన ఈ నారిలకు, సిఆర్పిలకు శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపిఎం రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపిఎం రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఉండేటువంటి పతి పది గ్రూపులకు ఒక ఈనారి పెట్టడం జరుగుతుందన్నారు. ఆ గ్రామ సంఘంలో 25 గ్రూపులు కంటే ఎక్కువ ఉంటే ముగ్గురు ఈనారీలు ఇద్దరు సిఆర్పిలు పనిచేయడం జరుగుతుందని దీని ద్వారా మన డబ్బులు మన లెక్కలు అనే కార్యక్రమాన్ని నిర్వహిణ సులభతరం అవుతందని,లావాదేవీల గురించి పూర్తిగా సమాచారం అందుబాటులో వుంటుందన్నారు. వీరి ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు ఉన్నటువంటి వారికి రావాల్సిన రుణాలను అందించడంలో వీరు ప్రముఖ పాత్ర వహిస్తారనీ, కులవృత్తులను ప్రోత్సహించడం, జెండర్ ఆక్టివిటీని ప్రోత్సహించటం, ఆర్థిక బలోపేతానికి పుస్తక నిర్వహణకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేసారు. మీరు గ్రామ సంఘం పరిధిలో పనిచేస్తు వీరు ద్వారా పేదరికం తగ్గించేటువంటి కార్యక్రమంలో వీళ్లు ముందుండి నడిపించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు శారదమ్మ, సీసీలు స్వామి, శ్రీలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతనలు తెలిపిన ఆర్యవైశ్య సంఘం నాయకులు









(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జనవరి 21)
ఆర్యవైశ్యుల సనాతన ధర్మం కోసం, ఆత్మ గౌరవంకోసం, పరువు ప్రతిష్టకోసం, వాసవి మాతను కుల దేవతగా ఆంధ్రప్రదేశ్‌లోని వైశ్య సమాజంలో పిలవబడే కోమటి సంఘ సభ్యులతో పాటు ఆర్యవైశ్య, కళింగవైశ్య, అరవవైశ్య, మరాఠీ వైశ్య, బేరి వైశ్య, త్రివర్ణిక వైశ్య సంఘాల వారందరికీ ఆరాధ్య దేవతగా కొలుస్తున్న శ్రీవాసవికన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక పట్టాభిరామ స్వామి ఆలయప్రాంగణంలో, కోదండరామస్వామి ఆలయంలో వనిత క్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి విజయభాస్కరరావు, ప్రధాన సెక్రటరీ రవికుమార్, ట్రెజరర్ చినమనగుండ సుబ్రహ్మణ్యం, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లకు కృతజ్ఞతాభివందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి చిత్రపటాన్ని అంగ రంగ వైభవంగా ముస్తాబు చేసి ఆలయ పూజారి కారంపుడి రమణాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని ఆలపించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కస్సెట్టి రవికుమార్‌లు, సిహెచ్ సుబ్రహ్మణ్యంలు కలిసి సంయుక్తంగా మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత అయిన వాసవి మాత ఆంధ్రప్రదేశ్, రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ పట్టణంలోని కుసుమ శ్రేష్ఠి, కుసుమాంబ అను పుణ్యదంపతులకు పుట్టిన ముద్దుల బిడ్డ అన్నారు. కుసుమ వీరు నిత్యందైవారాధన చింతన గలిగిన వారన్నారు. వీరికి సంతానం లేకపోవడంతో వారి గురువైన భాస్కరాచార్యుల ఆజ్ఞానుసారం దశరథ మహారాజు చేసిన పుత్రకామాష్టి యాగాన్ని చేయడం జరిగింది. దీంతో ఉమామహేశ్వరి దేవత ప్రత్యక్షమై వారికి రెండు ఫాలాలను సమర్పించడం జరిగింది. దీంతో వారికి ఇద్దరు కవల పిల్లలు జన్మించడం జరిగింది. వారిలో ఒకరు వాసవి కన్యకపరమేశ్వరి, మరొకరు విరూపాక్షుడు. వీరిద్దరిని తల్లిదండ్రులు ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. అందానికి మారు పేరైన వీరు ఎంతో క్రమశిక్షణతో, పట్టుదలతో, సత్ ప్రవర్తనలు కలవారుగా పట్టణంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఇలాంటి వీరిలో వాసవికన్యకాపరమేశ్వరుని ఇంటి ముంగిట ఉన్న ఆమె అందచందాలకు ముగ్ధుడైన విష్ణువర్ధనరాజు ఆమెను వివాహం చేసుకుంటనని కోరడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి అయిన కుసుమ శ్రేష్టిఅంగీకరించకపోవడం జరిగిందన్నారు. దీంతో ఆగ్రహించిన విష్ణువర్ధన్‌రాజు గాంధర్వ వివాహమైన చేసుకుంటానని, మరల ఆయన వద్దకు మంత్రులను పంపించడం జరిగిందన్నారు. వైశ్యులకు, క్షత్రియరాజులకు వివాహ సంబంధాలు కుదరవన్నారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామ ప్రజలు సుమారు 714 గోత్రనామాలు కలిగిన వారిలో, 202 మంది గోత్రనామాలు కలిగిన వారందరూ వాసవి మాత నిర్ణయానికి అంగీకరించి అగ్నికి ఆహుతి కావడం జరిగిందన్నారు. దీంతో చివరకు ఆర్యవైశ్యుల ఉన్నతి కోసం, ఆత్మాభిమానం కోసం, కన్యగా మిగిలిపోతానని శపథం చేసి అగ్నికి ఆహుతి కావడం, దీంతో ఆమెను ఎవరైతే కొలుస్తారో వారి ఇంట సిరి సంపదలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని, నా కోసం అగ్నికి ఆహుతి అయిన 202 కుటుంబాల వారు మోక్షం పొందుతారన్నారు. ఆర్యవైశ్యుల విన్నపాలను పరిశీలించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 అక్టోబర్ 31వ తేదీన అధికారికంగా వాసవి పెనుగొండగా మార్చడం జరిగిందన్నారు. దీంతో మండలంలోని ఆర్యవైశ్యులందరూ ప్రభుత్వ అధినేతలకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. పెనుగొండలో ఆర్యవైశ్యులు సమిష్టిగా పంచ లోహాలతో తయారు చేసిన 90 అడుగుల నిలువెత్తు విగ్రహాన్ని, 44 టన్నుల బరువుతో తయారు చేయడం జరిగిందన్నారు. కాశీకి పోతే ఎంత పుణ్యం, మోక్షం లభిస్తుందో పెనుగొండలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవతను చూస్తే కూడా అంత మోక్షం లభిస్తుందన్నారు. ఈ అమ్మవారి ఆలయాలు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రాలో సుమారు 18 పట్టణాల్లో వెలిశాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాజి విజయభాస్కరరావు, కసెట్టి రవికుమార్, ట్రెజరర్ పోలేపల్లి జనార్ధన్ రావు, చినమనగుండ సుబ్రహ్మణ్యం, జవ్వాజి వెంకటేశ్వర్లు, నేరెళ్ల జనార్ధనరావు, దోగిపర్తి మల్లికార్జునరావు, దోగిపర్తి హరిబాబు, చెక్క బాల రంగం, టిడిపి నాయకులు కోలగట్ల కాశీశ్వరరెడ్డి, కోలగట్లభాస్కరరెడ్డి, గోసు వెంకటేశ్వర్లు, గాదంశెట్టి శేషగిరిరావు, తుమ్మలపెంట సురేష్, జి వెంకన్న, నాగలక్ష్మి, పోలేపల్లి లక్ష్మి, చెక్క మహాలక్ష్మి, కొప్పరపు రత్తమ్మ, జె శేషకుమారి, శ్రావణి, సిహెచ్, అనంత లక్ష్మమ్మ, కసెట్టి కామేశ్వరమ్మ, అప్పల సరస్వతి, సౌజన్య, డి పద్మ, దీప్తి, డి లక్ష్మి, మానస, శైలజ, భాగ్యం, ఎం సుప్రజ, వాగిచర్ల మహాలక్ష్మి, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా వ్యాప్తంగా స్కూల్స్, కాలేజీల వద్ద విస్తృత భద్రతా చర్యలు డ్రోన్ కెమెరాలతో నిఘా







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)
విద్యార్థులు భద్రతతో, ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలనే లక్ష్యంతో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా స్కూల్స్, కాలేజీల పరిసరాల్లో పోలీసు నిఘాను సమర్థవంతమైన భద్రతా చర్యలు చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిసిఆర్, డ్రోన్ కెమెరాల ఇంచార్జి ఇన్స్‌పెక్టర్ దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో స్కూల్, కాలేజీ ప్రారంభం, ముగింపు సమయాల్లో పోలీసు బీట్స్‌తో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయటం జరిగింది. విద్యార్థులు స్కూల్స్, కాలేజీలకు వెళ్లే సమయంలో మోటార్ సైకిళ్లు, ఆటోల్లో వేధింపులకు పాల్పడే అకతాయిలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరిగింది. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి అనుచిత చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్స్, కాలేజీల వద్ద దింపే సమయంలో పరిసర ప్రాంతాలపై కాస్త శ్రద్ధ చూపాలని, ఏవైనా అనుమానంగా అనిపిస్తే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కాలేజీల వద్ద బయట రహదారి కనిపించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా పరిసరాల్లో జరుగుతున్న అంశాలను సులభంగా గమనించవచ్చని తెలిపారు. స్కూల్స్ లేదా కాలేజీల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. స్కూల్ ప్రారంభానికి ముందు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయులు స్కూల్ పరిసరాలను కాస్త గమనిస్తే భద్రత మరింత మెరుగవుతుందని పోలీసులు తెలిపారు. అలాగే స్కూల్స్ లేదా కాలేజీల పరిసరాల్లో ఇబ్బందులు కలిగించే లేదా వేధింపులకు పాల్పడే వారి పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## "కొత్త గబ్బిలం" పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహిత్యకారులు

### ఎండ్లూరి సుధాకర్ కి ఘన నివాళి 'కొత్త గబ్బిలం' పరిచయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)
ప్రముఖ కవి, సాహితీవేత్త ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌కు పలువురు న్యాయవాదులు, సాహితీవేత్తలు ఘన నివాళి అర్పించారు. జానుడి - సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ కార్యదర్శి డాక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వంలో బుధవారం ఒంగోలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాది అట్లూరి రాఘవులు పాల్గొని ప్రసంగించారు. ఆచార్యుడిగా, సామాజికవేత్తగా ఎండ్లూరి సుధాకర్ విశేషమైన పాత్ర నిర్వహించారని అన్నారు. సాహితీవేత్త, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ ఈ సందర్భంగా ఎండ్లూరి సుధాకర్ 'కొత్త గబ్బిలం' కావ్యాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ఎన్ నాగేశ్వరరావు, జానుడి సాహితీ సంస్థ అధ్యక్షుడు ఎద్దు విజయకుమార్, సాహిత్య అభిమానులు పాలపర్తి మనోజ్ కుమార్, రత్నం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)
ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వానికి తావులేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) విభాగాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను కలెక్టర్ పరిశీలించి, వాటి పరిష్కార విధానంపై సంబంధిత అధికారులతో చర్చించారు. అర్జీదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. పలు అర్జీలకు సంబంధించి మార్టూరు మండల ఎంఆర్ఓతో పాటు ద్రోణదుల గ్రామ వీఆర్ఓలతో ఫోన్‌లో మాట్లాడి అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ద్రోణదుల గ్రామానికి చెందిన ఒక అర్జీదారుడి సమస్య పై వీఆర్ఓ రాంబాబుతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారుడికి సరైన సమయంలో సమాచారం ఇవ్వకపోవడం, నిర్ణీత గడువులో అర్జీని పరిష్కరించకపోవడం పై వివరణ కోరుతూ సంబంధిత వీఆర్ఓకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి, అర్జీదారులకు సకాలంలో సమాచారం అందిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

# రైతుల వద్ద మిగిలి ఉన్న బర్లీ పొగాకు కొనుగోలుకు చేయండి

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జనవరి 21)**

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో బుధవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో ఎమ్మెల్యే ఏలూరి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న బర్లీ పొగాకు కొనుగోలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంట నిల్వలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కూటమి ప్రభుత్వం నల్లబర్లీ రైతాంగానికి అండగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వమే బర్లీ కొనుగోలు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అలాగే మార్టూరు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యాలయం కొనసాగితే చుట్టుపక్కల మండలాల ప్రజలకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వివరించారు. సబ్ ట్రెజరీ కొనసాగింపుతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సేవలు

**మార్టూరు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని కొనసాగించండి**
**వరద కాలువ ఆధునికరణకు చర్యలు చెరువు తీసుకోండి**
**ఆర్థిక శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే ఏలూరి**



పొందగలరని తెలిపారు. ఇక ప్రతిఏటా వర్షాకాలంలో సమస్యగా మారుతున్న వరద కాలువ ఆధునికరణపై ప్రత్యేకంగా చర్చించారు. వరద నీటితో పంటలు, నివాస ప్రాంతాలు నష్టపోకుండా కాలువలను ఆధునికీకరించి, చెరువుల అనుసంధానం చేయడం ద్వారా నీటి పారుదల వ్యవస్థను మెరుగు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఏలూరి చేసిన విజ్ఞప్తులను మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జీఎంఎస్‌కేలకు అవగాహన సమావేశం





**(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 21)**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కంభం మండలంలోని గ్రామ మోడల్ సేవా కేంద్రాల నిర్వాహకులతో కంభం ఎస్సై శివ కృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్, ఈ–గవర్నెన్స్, వాట్సాప్ గవర్నెన్స్ సేవల ద్వారా ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించి, ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అనుమానాస్పద లింకులు, ఫేక్ కాల్స్, ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రోడ్డు భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల పాటనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జీఎంఎస్‌కే నిర్వాహకులకు సూచించారు. ప్రజల భద్రత, సేవల వేగవంతమైన అందుబాటు కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్ఐ శివ కృష్ణారెడ్డి తెలిపారు. సమావేశంలో జీఎంఎస్‌కే నిర్వాహకులు పాల్గొన్నారు.

## 25న చెన్నకేశవస్వామి రథసప్తమి వేడుకలు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 21)**

మార్కాపురం జిల్లా కేంద్రంలో వెలిసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసలు జిల్లా అధికారులకు, డిఎస్ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సప్త వాహనాల పై వివిధ అలంకారంలో చెన్నకేశవ స్వామి పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ప్రత్యేకంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి వెండి రథోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్, వైద్య, ఫైర్ ఇంజన్, దేవదాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎప్పుడు జరగని విధంగా అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణ, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ఈవో గోలమారి శ్రీనివాసరెడ్డి, ఎమ్మార్వో చిరంజీవి, మాజీ ఆలయ చైర్మన్ యాక్కలి కాశీవిశ్వనాథ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నారి, సిఆర్పిలకు శిక్షణ






**వెలుగు, మద్దిపూడి, జనవరి 21)**

మద్దిపూడి వెలుగు కార్యాలయంలో బుధవారం ఈనారి, సిఆర్పి లకు ఏపిఎమ్ కోటేశ్వరరావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో నాగూర్ వలి మాట్లాడుతూ ఈనారి, సీఆర్పీలు గ్రామస్థాయిలో ఉన్న చిన్న సంఘాలకు సమావేశాలు ఏర్పాటు చేయుటం, పుస్తక నిర్వహణ చేయడం, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించి సంఘాల యొక్క ప్రతిష్టత కోసం పనిచేయాలని తెలియజేశారు. ఎపిఎం ఎల్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సంఘాలలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీల పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన డబ్బులు మన లెక్కలు యాప్ ప్రతి సభ్యురాలు కు డౌన్లోడ్ చేయించి ఈ యాప్ వల్ల వచ్చే ఉపయోగాలు ప్రతి గ్రూపు కు తెలియచేసి సంఘాల్లో జరుగుతున్న లోపాలను సవరించాలని తెలియజేయడం జరిగింది. అదే విధంగా జోవనోపాదనలో భాగంగా పిఎంఈజిపి, పిఎంఎఫ్ఎంఈ పథకాల గురించి సభ్యులకు తెలియజేశారు. ఈ పథకం అప్లై చేసుకునే విధంగా సభ్యులందరికీ అవగాహనా కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు నవనీతమ్మ, సిసి లు రామయ్య, కళ్యాణి, అకౌంటెంట్ రజిని, వివిధ గ్రామాల విఓఏలు, ఈనారి, సిఆర్పిలు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబం నుంచి ఎస్సై స్థాయికి గ్రామీణ ఆణిముత్యం భాను

**అభినందించిన ఎమ్మెల్యే ఏలూరి**



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జనవరి 21)**

నిరుపేద కుటుంబం నుంచి ఉన్నత విద్యను అభ్యసించి, కష్టపడి ఎస్సై స్థాయికి భాను ఎదగడం గర్వకారణమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మార్టూరులోని తన క్యాంప్ కార్యాలయంలో నాయుడుపేట ఎస్ఐ శివరాత్రి భాను ఎమ్మెల్యే ఏలూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజారక్షణే లక్ష్యంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ మరిన్ని పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు. మార్టూరు మండలం జొన్నతాళి గ్రామానికి చెందిన భాను నిరుపేద కుటుంబంలో జన్మించి, ఉన్నత విద్యను అభ్యసిస్తూ కష్టపడి పోలీసు శాఖలో ఎస్సై స్థాయికి చేరడం గ్రామీణ యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. కష్టానికి తగ్గ ఫలితం తప్పకుండా దక్కుతుందనడానికి భాను జీవితం నిదర్శనమని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, ఆ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని భానుకు ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి భానును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## పట్టాదార్ పాస్‌పుస్తకాల వెరిఫికేషన్ ప్రక్రియ తనిఖీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)**



కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల గ్రామంలో జరుగుతున్న పట్టాదారు పాసు పుస్తకాల వెరిఫికేషన్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డుల పరిశీలన తీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఫీల్డ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి, విధివిధానాల పై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా చర్చించి, పట్టాదారు పాసు పుస్తకాల నమూనా ప్రతులను వారి వివరాలతో సరిపోల్చి పరిశీలించారు. రైతుల భూ వివరాలు, వ్యక్తిగత సమాచారం సరిగా నమోదయ్యాయా లేదా అనే అంశం పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భూమి రికార్డుల ధృవీకరణ అనేది అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ఇందులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ డి రామానాయుడు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఫైనాన్షియల్ లిటరసీ సిఆర్పిలకు శిక్షణ



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 21)**

మార్కాపురం జిల్లాలోని సంఘటితంగా ఉన్న మహిళా పొదుపు సంఘాలకి డిఆర్‌డిఏ వెలుగు సెర్ప్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఉన్న పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు ఆర్థిక చేకూర్పు ఫైనాన్షియల్ ఇన్సూరెన్స్ ఆర్థిక క్రమశిక్షణ తెలియజేయడం కోసం ఆర్థిక చేరిక ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అనే కార్యక్రమంలో వారికి శిక్షణ కార్యక్రమం ఇవ్వటం జరుగుతుంది. దీనిలో భాగంగా మార్కాపురం జిల్లా కేంద్రంగా మార్కాపురం డ్వాక్రా బజార్ నందు జిల్లాలో ఉన్న 21 మండలాల్లో ఎంపిక చేయబడిన ఫైనాన్షియల్ లిటరసీ సిఆర్పిలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ సంవత్సరం మండలంలోని ఉన్న సగం సంఘాలకు ఎంపిక చేయబడిన ఎనిమిది మంది సీఆర్పీలు ద్వారా వారికి ఆర్థిక చేకూర్పు ఆర్థిక శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్చి వారిని సాక్ష్యం యాప్ లో పొందుపరచడం జరుగుతుంది. ఈ సాక్ష్యం యాప్ ద్వారా రాష్ట్రస్థాయిలో సెర్ప్, జాతియ స్థాయిలో ఎన్ఆర్ఎల్ఎం, ఆర్బిఐ ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతా ఉంది , మిగిలిన సగం గ్రూపులకు వచ్చే సంవత్సరం ఇంక్లూషన్ ఇచ్చి నెక్స్ట్ ఇయర్ కల్లా 2026 27 కల్లా మహిళా సంఘాల అందరికీ సంఘాల్లో ఉన్నటువంటి సభ్యురాలు అందరికీ ఆర్థిక క్రమశిక్షణను తెలియజేసి నేర్పించడం జరుగుతుంది. ఈ శిక్షణ కార్యక్రమానికి డీపీఎం సీబీవో ఫైనాన్స్ ఆర్ఆర్ఎల్ అంబేద్కర్, డీపీఎంలు దానం స్థానిక స్వామీ దుగ్గెం పిచ్చయ్యలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ రికార్డు రూమును సందర్శించిన జెసి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)**

జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ ఒంగోలు కలెక్టరేట్‌లోని రికార్డు రూమును బుధవారం సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకాశం జిల్లా నుండి నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పడినందున, మార్కాపురం జిల్లాకు సంబంధించిన రెవిన్యూ రికార్డులను సదరు జిల్లాకు పంపుటలో భాగంగా రికార్డుల విభజన ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి, సంబంధిత సెక్షన్ అధికారులతో కలసి పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంట కలెక్టరేట్ ఏఓ టి రవి, సంబంధిత సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







షణ్ముఖ వెలుగు
ePaper www.shanmukhavelugu.com


## ముత్తు మన జీవితాలను చిత్తు చేస్తుంది




(షణ్ముఖ వెలుగు, గోపవరం, జనవరి 21)
మత్తుకు అలవాటు పడితే మన జీవితాలను అది చిత్తు చేస్తుందని కావున మత్తుకు దూరంగా ఉండాలని ,మత్తు పట్ల తస్మాత్ జాగ్రత్తగా వ్యవహరించాలని బద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రాంగణాన్ని డ్రగ్ ఫ్రీ జోన్‌గా ప్రకటిస్తూ, విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులతో డ్రగ్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించి, మత్తుపదార్థాలకు దూ రంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవ ర్చుకోవాలని పాఠశాల యాజమాన్యం పిలుపునిచ్చింది. ర్యాలీలో విద్యార్థులు వివిధ నినాదాలు చేస్తూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై సమాజానికి చైతన్యం కలిగించారు. గాజులపల్లి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలు విద్యార్థుల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసే ప్రమాదకర అల వాట్లని తెలిపారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రమ శిక్షణతో చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్తును నిర్మించు కోవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాన్ని డ్రగ్ ఫ్రీ జోన్‌గా ప్రకటించడం ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాభావం, స్వీయ నియం త్రణ పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ జి భారతి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల నుంచి మంచి స్పందనను పొందిందని నిర్వాహకులు తెలిపారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాల పై ప్రజలకు అవగాహన కల్పించిన ప్రకాశం పోలీసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 21)
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ యు సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రజలకు, యువతకు మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, ఈగల్ టీం సభ్యులు పాల్గొని మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సంబంధిత చట్టాలు, విధించే శిక్షలపై వివరించారు. యువత సరదా కోసం ప్రారంభించే గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వ్యసనాలు వారి జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో స్పష్టంగా తెలియజేశారు. వ్యసనాలకు బానిసైన వ్యక్తులు డబ్బు కోసం దొంగతనాలు చేయడంతో పాటు ఇతర నేరాలకు పాల్పడే అవకాశముంటుందన్నారు. మాదక ద్రవ్యాల రవాణా మరియు విక్రయాలపై పోలీసులు నిఘా ఉంచి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించి, వారు చెడు మార్గాల్లోకి వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సూచించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా ధూమపానం చేస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. అలాగే డార్మిటరీలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా చేయాలనే లక్ష్యంతో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా స్కూల్స్, కాలేజీల పరిసరాల్లో పోలీసు నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## జాతీయ ఆహార భద్రత కార్యక్రమం ఎస్సీ రైతులకు 50 శాతం రాయితీ పై మినుములు అందజేత




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జనవరి 21)
మండలంలోని త్రిపురాంతకం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఆహార భద్రత, పోషణ మిషన్ పథకం క్రింద 50 శాతం రాయితీ పై ఎస్‌సి సామాజిక వర్గానికి సంబందించిన రైతులకు మినుములు అందిచటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతుల వృద్ధి కోసం ఈ కార్యక్రమం బాగా ఉపయోగ పడుతుంది అని, విత్తనాలే కాకుండా మినుము పంటకు కావలసిన పురుగు మందులు, నానో యూరియా, న్యూట్రిన్ లు 50% సబ్సిడీ పై ఈ పథకం లో తీసుకున్న 25 రైతులకు అందచేస్తాము అని తెలపటం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ అబిద్ హుస్సేన్ మరియు రైతులు పాల్గొనటం జరిగింది.

# గణతంత్ర దినోత్సవ వేడుకలు గుర్తుండిపోవాలి

**24 వ తేదీ నాటికి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాలి**

**జిల్లా కేంద్రంలోని ప్రతి కార్యాలయం ఆవరణలో జాతీయ పతాకం అవిష్కరించాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)
ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కేంద్రం లో ఈ నెల 26న పోలీసు పెరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లు పై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26న జిల్లా కేంద్రం పోలీస్ పెరేడ్ మైదానం నందు నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలను అధికారులు అందరు సమన్వయం తో పని చేసి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 26 న జిల్లా కేంద్రం లోని పోలీస్ పెరేడ్ మైదానము నందు ఉదయం 9 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ జరుగుతుందని ఇందుకోసం అన్ని ఏర్పాట్లును ఈ నెల 24 సాయంత్రం కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ పతాకం, ప్రధాన వేదిక వద్ద స్టేజ్ డెకరేషన్, పోలీస్ పెరేడ్ కోసం పోలీసులు, మాజీ సైనికులు, యన్‌సిసి, స్కౌట్ పోలీసు బ్యాండ్, విద్యార్థుల పెరేడ్ చక్కగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని డిఎస్పీని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని మొత్తానికి జాయింట్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తారు అన్నారు. శకటాలు, స్టాల్స్, సిట్టింగ్ ప్రోటోకాల్ ఏర్పాట్లును డిప్యూటీ కలెక్టర్, బాపట్ల ఆర్డీఓ,తహశీల్దార్ చూడాలన్నారు. జాతీయ సమైక్యత ఉట్టిపడేలా, మన సంస్కృతి సాంప్రదాయాలు ఉండే విధానగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలని, మంచి చాతుర్యం కలిగిన యాంకర్స్‌ను అందుబాటులో ఉంచాలని డీఈఓను ఆదేశించారు. పోలీస్ పెరేడ్ మైదానం నందు యల్‌ఈడిలు, టెంట్స్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి ఈఈ ను ఆదేశించారు. గ్రౌండ్ నందు అంబులెన్స్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్‌ఓకి సూచించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలియజేసేలా శకటాల ప్రదర్శన, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాలని, జిల్లా కేంద్రంలోని ప్రతి కార్యాలయంలో ఆవరణలో జాతీయ పతాకం అవిష్కారణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రముఖులకు, మీడియాకు, విద్యార్థులకు హాజరైన వారికి స్నాక్స్, వాటర్ అందించాలని డిఎస్‌ఓను గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈను ఆదేశించారు. వివిధ శాఖల ద్వారా ప్రతిభ కనబరిచిన ఉద్యోగస్తులకు, జిల్లాలో వివిధ రకాలు గా సేవ చేసిన స్వచ్ఛంద సంస్థలు, జాతీయ స్థాయి లో గుర్తింపు పొందిన వారికి మరియు జిల్లాలో ఇతర కార్యక్రమాలు బాగా చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని, ప్రశంసా పాత్రల వివరాలను కలెక్టరేట్‌లోని ఏఓకి జాబితాను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో బాపట్ల, చీరాల ఆర్డీఓలు పి గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, కలెక్టరేట్ ఏఓ మల్లిఖార్జునరావు, పశుసంవర్ధక శాఖ జె డి వేణుగోపాల్, సమాచారశాఖ ఏడి పి వెంకట్రమణ, సిపిఓ ఏ ఎస్ రాజు, డియంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఐసిడి ఎస్, గృహ నిర్మాణ సంస్థ పిడిలు రాధమాదవి, వెంకటేశ్వరరావు, ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రఘునాధ్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఈఈ అరుణ, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ షఫీ, బాపట్ల తహశీల్దార్ షేక్ సలీమా, పోలీసు శాఖ నుండి డిఎస్పీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ అండర్ 14 క్రికెట్ టీంలో ఎంపికైన బాపట్ల జిల్లా విద్యార్థి

**అభినందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 21)
ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 స్టేట్ క్రికెట్ టీం లో బాపట్ల పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్ ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో అబ్దుల్‌సాద్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టేట్ అండర్ 14 క్రికెట్ టీం లో బాపట్ల పట్టడానికి చెందిన అబ్దుల్ సాద్ ఎంపీ కావడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా తమ ప్రతిభను కనబరిచాలన్నారు. అదే స్ఫూర్తితో చిన్ననాటి నుండి క్రికెట్ మీద మక్కువతో అండర్ 14 జిల్లా సెలక్షన్ లో జిల్లా టీంలో ఎంపిక కావడం జరిగిందన్నారు. పేరేచర్లలో జరిగిన జిల్లా టీంలో 3 మ్యాచుల్లో 220 పరుగులు, 5 వికెట్లు సాధించి ఉత్తమ కనపరచడంతో సెంట్రల్ జోన్లో టీం లో స్థానం సాధించడం జరిగిందన్నారు. జోన్ మ్యాచెస్ లో 6 ఇన్నింగ్స్ లో 16 వికెట్లు సాధించడంతో అబ్దుల్ సాద్ ను స్టేట్ టీం కి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో స్టేట్ టీంలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన తెలిపారు. అబ్దుల్ సాద్ ను చిన్ననాటి నుంచి కోచింగ్ ఇస్తున్న కోచ్ సయ్యద్ అమీర్ ను సాద్‌ఉనైస్ ను ప్రోత్సహిస్తున్న బాపట్ల క్రికెట్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే శిక్ష తప్పదు

ఎవరైనా సరే ఊరుకునే ప్రసక్తే లేదు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 21)
మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారి పై పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ పొదిలి పట్టణంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ ఉన్న ప్రాంతంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాన్ని మందుబాబులు, నగర పంచాయతీ కార్మికుల చేత పారిశుద్ధ్య పనులను సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ చేయించారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే ఆస్కారం ఉన్నందున పోలీసులు ముమ్మరంగా గస్తీ చేపట్టామని సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. అంతే గాక బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బంది కరంగా మారితే శిక్ష తప్పదని మందుబాబులను హెచ్చరించారు. ఈ పారిశుద్ధ్య పనుల్లో పోలీస్ సిబ్బందితో పాటు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


అమృతమూర్తికి అశ్రునివాళి...



కీ॥శే॥ శ్రీమతి శాఖమూరు సుశీల దేవి గారు.
W/o Late CA. శాఖమూరు శ్రీరామమూర్తి గారు.

నీ ప్రేమపూర్వక ఆతిథ్యం దానికి లేదమ్మా స్థిరమైన కొలమానం.
నీ వాత్సల్యం అనంతం, అజరామరం నీ రుణం తీర్చలేనిది.....

మీ కుమారులు
శాఖమూరు సురేష్ బాబు శాఖమూరు చంద్రశేఖర్ శాఖమూరు శ్రీనివాస్
మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ
22-01-2026, 11.30am నుండి
at Waltair Club,
Centenary Auditorium, Visakhapatnam.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com